రహస్య విచారణలో లీకులెట్ల ఇస్తరు?

జస్టిస్ నర్సింహారెడ్డి మీడియాతో ఎలా మాట్లాడారు?

దర్యాప్తు సంస్థలను కాదని కమిషన్లంటే కాలయాపనే

ఉమ్మడి ఏపీలో వేసిన 70 కమిషన్లు ఏమీ తేల్చలేదు

గ్యారెంటీల అమలు దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా

కుంగిన పిల్లర్లు సరిచేయకుండా రైతులకు రేవంత్ అన్యాయం

నిరుద్యోగులను బస్సుల్లో తిప్పి ఎమ్మెల్సీలైన కోదండరాం, వెంకట్

నిరుద్యోగులే కాంగ్రెస్ పాలకుల అధికార మదాన్ని దింపుతరు

కాంగ్రెస్ సర్కారుపై విరుచుకుపడిన ప్రొఫెసర్ వినోద్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 30 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: రహస్యంగా చేయాల్సిన విచారణపై ముందుగానే తీర్పు ఎలా ఇస్తారు? మీడియాతో మాట్లాడుతూ లీకులిస్తున్నారు.. అసలు ఆ అధికారం ఎవరిచ్చారు? కొనుగోళ్లలో ఏం జరిగిందో, లోపాలు ఏమున్నాయో? అనేది మాత్రమే కమిషన్ తేల్చాలి. ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి.. అంతేకానీ, ముందే తీర్పు ఇస్తే ఎట్ల? అని విద్యుత్తు కొనుగోళ్లపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ తీరుపై ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ఈ కమిషన్ నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆక్షేపించారు. వాస్తవానికి వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగితే అవినీతికి తావుండే అవకాశం ఉంటుందని, కానీ రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన కొనుగోళ్ల ఒప్పందంలో అక్రమాలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఇదంతా కేవలం కేసీఆర్ ప్రభుత్వాన్ని బదనాం చేయడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేసిన గాలి వినోద్‌కుమార్.. కాళేశ్వరం అంశంతోపాటు ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులు పడుతున్న ఇబ్బందులు, వారి ఆవేదనను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. వినోద్‌కుమార్ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

ఉమ్మడి ఏపీలో వేసిన 70 కమిషన్లు ఏం తేల్చాయి?

వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగితే అక్రమాలు జరిగే ఆస్కారం ఉంటుంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందంలో ఇతర లావాదేవీలకు తావే ఉండదు. కొన్ని మార్గదర్శకాలు, నిబంధనలు ఉంటాయి. అదే రీతిన ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందం జరిగింది. అదేమీ కేసీఆర్ సొంత వ్యవహారం కాదు. సీఎం హోదాలో కేసీఆర్ ఆదేశాలు ఇస్తారు గానీ, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు, ఒప్పందాల ప్రక్రియ పూర్తిచేసేది అధికారులు మాత్రమే. ఒకవేళ అధికారులు అవినీతికి పాల్పడితే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఉన్న ఆ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఆ అధికారులను పక్కన పెట్టుకొని మొత్తం కేసీఆర్ తప్పు చేశాడు, కింది నుంచి పైదాకా అంతా కేసీఆర్ సంతకాలు చేశారు అన్నట్టుగా సీఎం రేవంత్ బదనాం చేస్తున్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయనుకుంటే విచారణకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని దర్యాప్తు సంస్థలతోనైనా విచారణ చేపట్టవచ్చు. కానీ, న్యాయ విచారణ పేరిట కాలయాపనకు దిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ అంశాలపై వేసిన 70 కమిషన్లు కించిత్తు తేల్చలేకపోయాయి. ఇప్పుడు నర్సింహారెడ్డి కమిషన్ కూడా తేల్చేదీ ఏమీ ఉండదు. కేవలం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల్లో చర్చ జరగకుండా, వారి దృష్టిని మరల్చేందుకు మాత్రమే ఈ కమిషన్ వేశారనేది అందరికీ అర్థమవుతుంది. విచారణను రహస్యంగా చేపట్టకుండా, ముందుగానే తీర్పు ఇస్తున్నారు. మీడియాకు లీకులు ఇస్తున్నారు. అసలు మీడియాతో మాట్లాడే అధికారం ఆయనకు ఎవరిచ్చారు? కొనుగోళ్లలో ఏం జరిగిందో, అందులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనేది మాత్రమే కమిషన్ తేల్చాలి. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలిగానీ తీర్పు ఇస్తే ఎట్ల? తీర్పులు ఇచ్చేందుకు న్యాయస్థానాలు ఉన్నాయి కదా.

అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలు

మనం ఒక ఇల్లు కట్టుకునేందుకు బిల్డర్‌కు కాంట్రాక్టు ఇస్తం. అందులో ఒక పిల్లర్ కుంగిపోతే బాధ్యత యజమానిదా? బిల్డర్‌దా? కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిపోయాయి. కానీ అదేదో అంతా కేసీఆర్ చేయడం వల్లే అయిందంటూ రాజకీయంగా బదనాం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. నాడు సీఎంగా కేసీఆర్ తాపీ పట్టి బరాజ్ నిర్మించారా? నేడు కాంగ్రెస్ అధికారంలోనే ఉన్నది కదా.. వెంటనే విచారణ చేసి బాధ్యులైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోతే, మొత్తం ప్రాజెక్టు కుప్పకూలినట్టుగా చిత్రీకరిస్తున్నారు. రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పొద్దున లేస్తే కాళేశ్వరంలో అవినీతి అంటూ ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. రాష్ట్రంలో రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా పంటలను ఎండబెడుతుంది. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలన్నీ ఆడుతున్నది. ఒకవైపు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సాంకేతికంగా అన్నిరకాలుగా పరిశీలించి, ప్రస్తుతం మరమ్మతులు చేయాలనిని ఆదేశించింది. దాని మీద దృష్టి పెట్టకుండా, రూ.98 వేల కోట్లు ఖర్చయిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ రాజకీయంగా కేసీఆర్‌ను బదనాం చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి తన సమయాన్నంతా కేటాయిస్తున్నారు. నిజంగా కాళేశ్వరంలో అవినీతి జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐకి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు? మళ్లీ ఇందులో కూడా న్యాయ విచారణ అంటూ కాలయాపన చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది.

అధికారంలోకి రాగానే నిరుద్యోగులు పలుచనయ్యారా?

ఎన్నికల ముందు కోదండరాంరెడ్డి, బల్మూరి వెంకట్, రియాజ్ వంటి వాళ్లు నిరుద్యోగులను బస్సుల్లో తిప్పి రాజకీయంగా వాడుకున్నరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోదండరాంరెడ్డి, బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీలయ్యారు. రియాజ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయ్యారు. ఆకునూరి మురళికి కూడా ఏదో పదవి ఇస్తున్నారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. వందరోజుల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, అమలులోకి తీసుకొచ్చి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని 2023 అక్టోబర్ 1న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి రాగానే గ్రూప్-1లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తామని అసెంబ్లీ వేదికగా చెప్పిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం అయ్యారు. ఇప్పుడు అన్ని శాఖల్లో 2,67,032 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి. ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాలు నింపుతామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు కనీసం జాబ్ క్యాలెండర్ ప్రకటించనేలేదు. నిరుద్యోగులకు సంబంధించిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. పైగా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తూ, జైళ్లలో పెడుతున్నారు. మొన్నటిదాకా 30 లక్షల మంది నిరుద్యోగులను వాడుకున్న రియాజ్ అధికారంలోకి రాగానే హౌలాగాళ్లు, పాగల్‌గాళ్లు.. అని తిడతారా! ఇంత అహంకారమా? అధికారం అప్పగించిన వాళ్లు ఇంత పలుచనగా కనబడుతున్నారా? అధికారానికి ఎక్కించినవాళ్లే స్థానిక సంస్థల్లో వీళ్లను జీరో చేస్తరు. అధికార మదాన్ని దించుతరు.

విఫలమైనందునే ఎంపీ సీట్లు తగ్గినయ్!

రాష్ట్రంలో ఎనిమిది మందే ఎమ్మెల్యేలున్న బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు వచ్చాయి. అదే 64 సీట్లు ఉన్న కాంగ్రెస్‌కు కూడా ఎనిమిది ఎంపీ సీట్లే వచ్చాయి. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందనేందుకు ఇదే ఉదాహరణ. ఏ ఒక్క వర్గానికీ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలనూ తుంగలో తొక్కుతున్నరు. పదోన్నతులు ఇచ్చి ఇదేదో తమ ఘనతగా చెప్పుకుంటున్నరు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా అన్ని ప్రక్రియలు పూర్తయితే వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మేమిచ్చినం అని చెప్తున్నరు. గత ప్రభుత్వంలో 10 మంది మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు ఉంటే ఇప్పుడు ఆరుగురికి పడిపోయారు. బీసీలు గతంలో 21 మంది ఎమ్మెల్యేలు ఉంటే ఇప్పుడు 17 మందే ఉన్నరు. కుల గణన చేస్తామని చెప్పి అది చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నరు. ఇలా ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయకుండా, హామీల అమలుపై చర్చ జరగకుండా కాలయాపన చేస్తున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తాను నెరవేర్చాల్సిన బాధ్యతలను గుర్తురగాలి.

యూఎస్‌కు వరంగల్ వస్త్రాలు

మొదటిపేజీ తరువాయి...

ఈ పరిశ్రమ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక, స్నేహపూర్వక విధానాలు, కేటీఆర్ పట్టుదలకు ఆకర్షితులై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టింది. దేశంలోని 12 రాష్ట్రాలు, శ్రీలంకను కాదని మన రాష్ట్రానికి రావటం విశేషం. 2021 జూలైలో కిటెక్స్ ఎండీ సాబూజాకబ్ వరంగల్, సీతారాంపూర్‌ను సందర్శించిన తర్వాత కేటీఆర్‌తో సమావేశమై రాష్ట్రంలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెడుతూ 4,000 ఉద్యోగాలు కల్పించనున్నట్టు ప్రకటించారు. దీంతో వారికోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారాంపూర్‌లో 250, వరంగల్‌లో 185 ఎకరాలు కేటాయించింది. నీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలను కల్పించింది. 2021, సెప్టెంబర్‌లో భూమి పూజ సందర్భంగా తన పెట్టుబడిని రూ.3,000 కోట్లకు పెంచడమే కాకుండా 50వేల ఉద్యోగాలు కల్పిస్తామని కిటెక్స్ ఎండీ వెల్లడించారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ జూలై చివర్లో ట్రయల్‌రన్‌కు సిద్ధమవుతుండగా, సీతారాంపూర్‌లో నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. మొదటి దశలో 12,000 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నది. ఈ ఏడాది చివరికల్లా సీతారాంపూర్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని కిటెక్స్ లక్ష్యంగా పెట్టుకున్నది. వరంగల్ పరిశ్రమలో ఈ ఏడాది మార్చిలోనే ఉత్పత్తి మొదలు పెట్టాలని నిర్ణయించినప్పటికీ విదేశాల నుంచి యంత్రసామాగ్రి రావటంలో జాప్యం వల్ల ఆ లస్యమైందదని పరిశ్రమవర్గాలు తెలిపాయి.

గిట్టుబాటు ధర, ఉద్యోగాల కల్పన

కాటన్ ఉత్పత్తిలో తెలంగాణ మూడో స్థానంలో ఉన్నది. ఇక్కడి కాటన్ మేలి రకమైనది. మన రాష్ట్రంలో గుజరాత్, తమిళనాడు తరహాలో చెప్పుకోదగ్గ వస్త్ర పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు లేకపోవటం వల్ల ఇక్కడి కాటన్‌కు తగిన గుర్తింపు రావటం లేదు. ప్రస్తుతం కిటెక్స్ సంస్థ కాటన్ ప్రాసెస్‌ను మెకనైజ్ చేస్తున్నది. దీంతో పత్తి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పరిశ్రమవర్గాలు చెప్తున్నాయి. వరంగల్, సీతారాంపూర్‌లో పరిశ్రమలు ఉత్పత్తి మొదలుపెడితే రోజుకు 2.2 మిలియన్ల దుస్తులు తయారవుతాయి. ఇవన్నీ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేయాలని సంస్థ నిర్ణయించింది. దీంతో రూ.4,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం రాష్ట్రానికి వచ్చే వస్తుంది. 50 వేల మంది ఉద్యోగాల్లో దాదాపు 30 వేల ఉద్యోగాలు ప్రత్యక్ష ఉద్యోగాలు కాగా, మిగిలినవి పరోక్ష ఉద్యోగాలు. మొత్తం ఉద్యోగాల్లో 85 శాతం మహిళలనే నియమించాలని సంస్థ నిర్ణయించింది. అలాగే, రైతుల పండించిన కాటన్‌లో 12-15 శాతం తీసుకోనున్నది.

సీతారాంపూర్‌లో అతి పొడవైన తయారీ పరిశ్రమ

సీతారాంపూర్‌లో ప్రపంచంలోనే అతి పొడవైన తయారీ పరిశ్రమ భవనాన్ని నిర్మిస్తున్నారు. 1,350 మీటర్ల పొడవైన మూడు భవనాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని టెక్సాస్‌లో టెస్లా కంపెనీ ప్రపంచంలో అతి పొడవైన భవనంగా ఉన్నది. టెస్లా భవనం పొడవు 1,160మీటర్లు. అంటే టెస్లా బిల్డింగ్ కన్నా సుమారు 190 మీటర్లు అధిక పొడవైన భవనాన్ని కిటెక్స్ నిర్మిస్తున్నది.

కిటెక్స్ తెలంగాణకు రాక వెనుక

2021లో పరిశ్రమను కేరళ నుంచి బయటకు తరలించాలని కిటెక్స్ సంస్థ నిర్ణయించింది. దీంతో దేశంలోని ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిశా తదితర 12 రాష్ట్రాలతోపాటు శ్రీలంక కూడా సదరు పరిశ్రమను తమప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించాయి. వారి ఆహ్వానంపై సంస్థ ఎండీ సాబూజాకబ్ ఆయా రాష్ట్రాలను సందర్శించారు. ఈ క్రమంలోనే జూలై 2021లో అప్పటి పరిశ్రమలశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కూడా వారిని తెలంగాణకు ఆహ్వానించారు. కరోనా లాక్‌డౌన్ ఉన్నందున తాను రాలేనని చెప్పడంతో ప్రత్యేక ఫ్లైట్‌ను కేరళకు పంపి ఆయనను రాష్ట్రానికి రప్పించారు.

విద్యుత్తు ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర

- అందుకే బిల్లుల వసూలు కాంట్రాక్ట్ అదానీ కంపెనీకి
- ఇది పాతబస్తీకే పరిమితం కాదు.. రాష్ట్రమంతా ఉంటది
- సబ్సిడీలు, ఉచిత కరెంటు బంద్
- మోటర్లకు మీటర్లు పెడుతరు
- ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే విద్యుత్తు వ్యవస్థ నాశనం
- మోదీ కనుసన్నల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం
- జగదీశ్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఓల్డ్‌సిటీలో విద్యుత్తు బిల్లుల వసూళ్లను అదానీ కంపెనీకి అప్పగిస్తామని లీకులివ్వడం తొలిమెట్టని, అది పాతబస్తీకే పరిమితం కాదని, రాష్ట్రమంతా అమలవుతుందని చెప్పారు. ఇక విద్యుత్తు ఉద్యోగుల పాత్ర నామమాత్రమవుతుందని, వ్యవస్థ మొత్తం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై విద్యుత్తు ఉద్యోగులు, వినియోగదారులు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. విద్యుత్తు బిల్లుల వసూలు కాంట్రాక్ట్ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్తు వ్యవస్థ ప్రైవేట్‌కు వెళ్తే సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక అమలు కాదని, వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతారని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా విద్యుత్తు రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించడానికి కేసీఆర్ అంగీకరించలేదని గుర్తుచేశారు. ప్రధాని మోదీ కనుసన్నల్లోనే రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, అందుకే మోదీ, అదానీ విధానాలను తెలంగాణలో రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు.

పాతబస్తీ ప్రజలను అవమానిస్తున్న రేవంత్

ఓల్డ్‌సిటీలో 45 శాతమే కరెంటు బిల్లులు వసూలవుతున్నాయని, అందుకే వసూలు బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగిస్తున్నట్టు ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చెప్పినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ మాటలు పూర్తి అబద్ధమని, పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఓల్డ్‌సిటీ నుంచి 97-98 శాతం వసూలయ్యాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి చర్యలు ఓల్డ్‌సిటీ ప్రజలను అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని, ఓల్డ్‌సిటీలో 200 యూనిట్లలోపే కరెంటు బిల్లు వచ్చే కుటుంబాలు ఎక్కువ ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటప్పుడు బిల్లుల వసూలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. బిల్లుల వసూలు చేతగాక ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నారా? లేక విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరంచేయాలని చూస్తున్నారా? అని నిలదీశారు. సింగరేణి బొగ్గు గనుల వేలంలో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్నారని, శ్రావణపల్లి బొగ్గు గని వేలాన్ని ఎందుకు ఆపలేదని నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని స్పష్టంచేశారు. బొగ్గు గనులను లీజుకు తీసుకున్న కంపెనీలను తాము అనుమతించబోమని ఇప్పటికే బీఆర్‌ఎస్ స్పష్టంచేసిందని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నేతలు క్యామ మల్లేశ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆటో యాప్ ఇంకెప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

తమను ఆదుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్త నిరసనలకు దిగేందుకు సిద్ధమయ్యారు. ఉచిత బస్సు స్కీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు గిరాకీ లేక తొలి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక, కుటుంబాలను పోషించుకోలేక నానా యాతన పడుతున్నారు. ఇలాంటి దుస్థితిలో కొందరు ఆటో డ్రైవర్లు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అయినా ప్రభుత్వం కనికరం చూపడం లేదని డ్రైవర్ల కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. మరోవైపు ఇతర రాష్ట్రాల వాహనాలు సైతం నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని తొలుత డ్రైవర్లు పోరుబాట పట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్ తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా ఇంకా అమలుకాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలను ఆదుకుంటామన్న మాటలు కూడా నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఆవేదన చెందుతున్నారు. తక్షణమే డ్రైవర్లను ఆదుకోవాలని, ప్రభుత్వమే యాప్ రూపొందించి అండగా నిలవాలని వివిధ వాహన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్త నిరసనలకు దిగుతామని వారు స్పష్టం చేస్తున్నారు.

కొత్త చట్టాలతో న్యాయ వ్యవస్థ నిర్వీర్యం

- దేశ రక్షణ కవచంపై మోదీ దెబ్బ
- ఎఫ్‌ఐఆర్ నమోదుకు 15 రోజులు
- బార్ కౌన్సిల్‌ను సంప్రదించలె
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): నేటినుంచి అమలుకానున్న మూడు కొత్త చట్టాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారనున్నాయని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం తెచ్చిన ఈ చట్టాలతో ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలుగుతుందని మండిపడ్డారు. ఎఫ్‌ఐఆర్ నమోదుకు 15 రోజులు, పోలీస్ కస్టడీకి 14 రోజులకు బదులు 90రోజుల దాకా అవకాశమిచ్చారని, తద్వారా బాధితుడికి అన్యాయం జరుగుతదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా తెచ్చిన చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ ఇన్‌చార్జి సోమభరత్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను కేంద్రం రద్దు చేసి కొత్తగా భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ పేర్లతో కొత్త చట్టాలు తెచ్చిందని, హిందీ, సంస్కృతంలో పెట్టిన ఈ పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. తమపై బలవంతంగా హిందీని రుద్దడం ఏమిటని ప్రశ్నించారు. చట్టాల మార్పు బిల్లులను నిరుడు ఆగస్టులో మోదీ సర్కారు ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలపై విస్తృతంగా పరిశీలించి అనేక మంచి సూచనలు చేసినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. దాదాపు 160 మంది పార్లమెంట్ సభ్యులను బయటకు పంపి బిల్లును కేంద్రం పాస్ చేయించుకున్నదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ న్యాయవాదులు, మేధావులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

ఆందోళనలతో రైతు చట్టాలు రద్దు

మోదీ తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలతో అనేక మంది రైతులు చనిపోయారని, నెలల తరబడి ఆందోళన చేయడం వల్ల వాటిని రద్దు చేసి మోదీ క్షమాపణ చెప్పారని వినోద్‌కుమార్ గుర్తుచేశారు. ఈ కొత్త చట్టాల అమలును కూడా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. 15 రోజులపాటు ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్ చేయకుండా ప్రిలిమినరీ ఎంక్వైరీ చేసేలా మార్పులు చేశారని, పోలీసుల చేతికే న్యాయ వ్యవస్థను అప్పగించారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే స్టేషన్ బెయిల్‌ను కొందరు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు దుర్వినియోగం చేస్తున్నారని, బాధితుడే హింసకు గురవుతున్నాడని మండిపడ్డారు. కొత్త చట్టాలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. వాటికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేస్తామని చెప్పారు.

బ్రిటీష్ వాళ్లకంటే దారుణం

కొత్త చట్టాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. అమలులో ఉన్న చట్టాలను మార్చాలంటే బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్స్, మేధోవర్గం అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. బ్రిటీష్ వాళ్లు సైతం చట్టం చేసే ముందు బార్ అసోసియేషన్లతోపాటు వర్తక సంఘాల అభిప్రాయాలు తీసుకున్నారని, మోదీ పాలన బ్రిటీష్‌వాళ్ల కంటే దారుణంగా తయారైందని విమర్శించారు. దేశ రక్షణ కవచాన్ని బలహీనపర్చేలా చట్టాలున్నాయని, ఇవి సుదీర్ఘ అనుభవం ఉన్న న్యాయవాదులకు సైతం అర్థం కావడం లేదని చెప్పారు. వీటి అమలుద్వారా ఈస్ట్ కంపెనీ, బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులు పునరావృతమవుతాయన్నారు. ఇప్పటికే కోటీకిపైగా కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని, కొత్త చట్టాలతో మరో కోటి కేసులు పెరిగే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. వందల సంఖ్యలో జైళ్లను పెంచినా ఇకపై సరిపోవని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నాయకురాలు ఎన్ లలితారెడ్డి పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులపై కిషన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 30: బొగ్గు బ్లాకుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు గనులను కేటాయించినప్పుడు తెలంగాణలో ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని తెలిపారు. బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి

వరంగల్ అభివృద్ధికి నిధులేవి రేవంత్?

- సీఎం పర్యటనతో నగరానికి ఒరిగిందేమీలేదు
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- రేవంత్‌కు 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యతిరేకం
- నర్సంపేట మాజీ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణ

హనుమకొండ, జూన్ 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చి వరంగల్ నగర అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని, ఆయన పర్యటనతో నగరానికి ఒరిగిందేమీ లేదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఎద్దేవా చేశారు. నగర అభివృద్ధికి రూ.6 వేల కోట్లు కావాలని సీఎంను మంత్రులు, ఎమ్మెల్యేలు అడిగితే కనీసం ప్రకటన చేయకుండా వెళ్లిపోయారని విమర్శించారు. ఆదివారం హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రాత్మక నగరానికి కేవలం ప్రైవేట్ దవాఖాన ప్రారంభానికి మాత్రమే వచ్చారని, ఆయనకు పెద్దల వైద్యం మీద ఉన్న శ్రద్ధ పేదల వైద్యం మీద లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి.. సర్కారు దవాఖానలను కార్పొరేట్ దవాఖానలకు దీటుగా తీర్చిదిద్ది వైద్యం అందించినట్టు గుర్తుచేశారు.

రేవంత్‌ను వ్యతిరేకిస్తున్న 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

రేవంత్‌రెడ్డి పర్యటనను కాంగ్రెస్ పార్టీ శ్రేణులే హర్షించడం లేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి పనితీరుపై విశ్వాసం తగ్గిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తుండగా కేవలం 26 మంది మాత్రమే బలపరుస్తున్నట్టు తెలిపారు. అధికారంపై సీఎంకు పట్టులేదని, క్యాబినెట్‌పై విశ్వాసం లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ పర్యటనతో వరంగల్‌కు ప్రయోజనం చేకూరకపోగా.. రూ.3 కోట్ల ప్రజాధనం వృథా అయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీ నుంచి నేరుగా వరంగల్‌కి వస్తే ఏదో జరుగుతుందని అనుకున్నామని, కానీ.. ఆయన వచ్చింది ప్రైవేట్ దవాఖాన ప్రారంభోత్సవానికని తెలిసిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్ జెండాలపై రగడ

రెబ్బెన, జూన్ 30: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ జెం డాలు కట్టడం, పార్టీ నాయకులతో కూడిన ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయడంపై రగడ జరిగింది. న వేగాంలో నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మం త్రి సీతక్క హాజరవుతుండగా, ఆసిఫాబాద్ ఎ మ్మెల్యే కోవ లక్ష్మి అక్కడికి చేరుకున్నారు. అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు కనిపించడంతో అక్కడున్న డీఎంహెచ్‌వో, కలెక్టర్‌తో మాట్లాడి కార్యక్రమంలో పా ల్గొనకుండానే వెళ్లిపోయారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పట్ల కావాలనే వివక్ష చూపుతున్నారని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తచట్టాలపై అవగాహన కల్పించాలి

- హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సురేందర్ సూచన
- సాంకేతికాంశాలతోనే చట్టాలు : జస్టిస్ మాధవి
- కాలానుగుణంగా చట్టాలు రావాలి: ఎంపీ రఘునందన్‌రావు

కొత్తచట్టాలపై పుస్తకాలను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు, ఎంపీ

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): జూలై 1 నుంచి అమల్లోకొస్తున్న కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేందర్ అభిప్రాయపడ్డారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్‌లోని చేర్పులను, పాత చట్టాల్లో ఉంచిన సెక్షన్లను యువ న్యాయవాదులు పూర్తిగా అవగాహన చేసుకోవాలని చెప్పారు. కొత్త క్రిమినల్ చట్టాలపై నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లా కాలేజీలో ఆదివారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. బాధితుల హ క్కుల పరిరక్షణ, సమర్థవంతంగా విచారణ ని ర్వహణకు కొత్తచట్టాలు ఉపయోగపడుతాయని తెలిపారు. 150 ఏండ్ల నాటి చట్టాలు నేటితో కనుమరుగు కానున్నాయని, సాంకేతిక అంశాలతో కొత్త చట్టాల రూపకల్పన అభినందనీయమని హైకోర్టు జస్టిస్ మాధవి పేర్కొన్నారు. ఏదై నా నేరం జరిగితే నిరూపించేందుకు, వాదించేందుకు, తీర్పులు చెప్పేందుకు నిర్ణీత సమయం ఇచ్చారని, తప్పనిసరిగా ఆ సమయంలో సం బంధిత విభాగం స్పందించాల్సిందేనని చెప్పా రు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ దేశ పరిస్థితులు, కాలానికి అనుగుణం గా కొత్త చట్టాలు రావాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ నేపథ్యంలోనే ప్రస్తుతం మూడు కొత్త చట్టాలను కేంద్రం తీసుకొచ్చిందని చెప్పారు. పాత చట్టాల్లోని మంచిని స్వీకరిస్తూనే, మన దేశ పరిస్థితులకు అనుగుణంగా కొత్తవి రూపొందిచుకోవడం గొప్ప విషయమని తెలిపారు. యువ న్యాయవాదులకు ఉపయోగపడేలా వర్క్‌షాప్ నిర్వహించిన ఫో రం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కొత్త చట్టాలపై రూపొందించిన పుస్తకాలను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఏ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వకేట్ ఎన్ రామ్‌చందర్‌రావు, సీనియర్ అడ్వకేట్లు బీ నారాయణరెడ్డి, బీ నర్సింహశర్మ, జే ప్రభాకర్, అశోక్ ఆనంద్‌కుమార్, డీఐజీ రెమా రాజేశ్వరి, కేశవ్ లా కాలేజీ ప్రిన్సిపాల్ వాణి, ఓయూ లా కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి ప్రసంగించారు.